శుక్రవారం 10-5-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 330, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616

email: mundadugu111@gmail.com

## ఎన్నికల ప్రచారం ప్రాథమిక హక్కు కాదు

### చట్టం అందరికీ సమానమే ▪ కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ వ్యతిరేకించిన ఈడీ

**ముందడుగు ఢిల్లీ:**

చట్టం అందరికీ సమానమేనని.. ఎన్నికల ప్రచారం అనేది రాజ్యాంగం ప్రకారం ప్రాథమిక, చట్టబద్ధమైన హక్కు కాదని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌ను ఈడీ వ్యతిరేకించింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో గురువారం ఈడీ అఫిడవిట్ దాఖలు చేసింది. ఎన్నికల ప్రచారం కోసం ఏ నాయకుడికి బెయిల్ ఇవ్వలేదని ఈడీ ఆఫిడవిట్‌లో తెలిపింది. ఏ రాజకీయ నాయకుడు ప్రత్యేక హోదాను క్లెయిమ్ చేయలేరని, నేరాలకు పాల్పడితే ఇతర పౌరుల మాదిరిగానే రాజకీయ నాయకులను అరెస్టు చేయవచ్చని ఈడీ స్పష్టం చేసింది. ఎన్నికల ప్రచారానికి మాత్రమే కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం సమానత్వ పాలనకు విరుద్ధమని దర్యాప్తు సంస్థ అఫిడవిట్‌లో పేర్కొంది. మంగళవారం ఓ పిటిషన్‌పై విచారణ సందర్భంగా అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రి అని.. అతడు సాధారణ నేరస్తుడు కాదని సుప్రీం కోర్టు పేర్కొంది. అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌పు సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయనున్నారు.





### ఆరు నెలల్లో బిఆర్ఎస్ రాజకీయాలను శాసిస్తోంది

వివరాలు 3లో

## సిక్కులు కనీసం 5 మంది పిల్లల్ని కనండి

- మీరు వారిని పెంచలేకపోతే మాకివ్వండి
- సిక్కుల సంస్థ అధినేత హర్నామ్ సింగ్ ఖల్సా



**ముందడుగు పంజాబ్:**

సిక్కులు కనీసం 5 మంది పిల్లలను కనాలని, మీరు వారిని పెంచలేకపోతే మాకు నలుగురిని ఇవ్వండి అని సిక్కుల సంస్థ దామ్‌దామి తక్సల్ అధినేత గియానీ హర్నామ్ సింగ్ ఖల్సా విజ్ఞప్తి చేశారు. పిల్లల సంఖ్యను పెంచడం ద్వారా కుటుంబ విలువలను కాపాడేందుకు మిగతా 2లో




## యోగీ ప్రచారంలో బుల్‌డోజర్ల డ్యాన్స్

- దేశ వ్యతిరేక శక్తుల కోసమే ఈ యంత్రాలు
- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వెల్లడి

**ముందడుగు ఉత్తరప్రదేశ్:**

యూపీలోని ఎన్నికల ప్రచారం ర్యాలీలో బుల్‌డోజర్లు డ్యాన్స్‌లేశాయి. ఫరూఖాబాద్ లోక్‌సభ స్థానం అలీగంజ్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ర్యాలీలో చోటు చేసుకొంది. స్థానిక డావ్ ఇంటర్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో యోగి నిన్న ప్రసంగించారు. మిగతా 2లో



### దేశంలో గణనీయంగా తగ్గిన హిందూ జనాభా

వివరాలు 3లో



### రోజు మెట్లు ఎక్కి దిగుతే చాలు..!

వివరాలు 4లో

### నేడు తెరుచుకోనున్న బద్రీనాథ్-కేదార్‌నాథ్

వివరాలు 4లో

### పదవ తరగతిలో 625/625

నూటికి నూరుశాతం మార్కులు సాధించిన అంకిత

వివరాలు 4లో

ముందడుగు
శుక్రవారం, 10-5-2024, హైదరాబాద్

# సిక్కులు కనీసం 5 మంది పిల్లల్ని కనండి

**మొదటిపేజీ తరువాయి**

దోహదపడుతుందన్నారు. అంతే కాకుండా సమాజం కూడా బలపడుతుందన్నారు. దమ్‌దామి తక్సల్‌కు కూడా ఖలిస్తానీ జర్నైల్ సింగ్ భింద్రన్‌వాలే నాయకత్వం వహించారు. ఎవరైనా ఎక్కువ మంది పిల్లలను పెంచడంలో సమస్య ఎదుర్కొంటే, ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్లయితే, మా సంస్థ వారికి సహాయం చేస్తుందని హర్నామ్ సింగ్ ఖల్సా చెప్పుకొచ్చారు.

సిక్కు కుటుంబాలు కనీసం 5 మంది పిల్లలను కనాలనే లక్ష్యంగా పెట్టుకోవాలని దామ్‌దామి తక్సల్ 16వ అధిపతి హర్నామ్ సింగ్ ఖల్సా అన్నారు. ఇది పంజాబ్‌ను మతపరంగా, సామాజికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా బలోపేతం చేయడానికి సహాయపడుతుందన్నారు. పంజాబ్‌లో నివసించే సిక్కులే కాకుండా ఇతర వర్గాల ప్రజలు కూడా కనీస సంఖ్యలో పిల్లలను కలిగి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. 5 మంది పిల్లలు ఉంటే వారిలో ఒకరు సాధువు అవుతారని, ఒకరు జతేదార్ అవుతారు, ఒకరు కుటుంబాన్ని పోషించుకుంటారని ఆయన చెప్పుకొచ్చారు. మీ కుటుంబాన్ని పెంచుకోండి, సమాజాన్ని కాపాడుకోండి అని అన్నారు.

# నేడు తెరుచుకోనున్న బద్రీనాథ్-కేదార్‌నాథ్

## 40 క్వింటాళ్ల పూలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు

**ముందడుగు ఉత్తరాఖండ్:**

ప్రముఖ జ్యోతిర్లింగ క్షేత్రమైన కేదార్‌నాథ్ ఆలయాన్ని మే 10వ తేదీన ప్రారంభించనున్నారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ తలుపులు తెరవనున్నారు. ఈ విషయాన్ని బద్రీనాథ్‌కేదార్‌నాథ్ ఆలయ కమిటీ చైర్మెన్ అజేంద్ర అజయ్ తెలిపారు. చార్‌థామ్ యాత్రలో భాగంగా కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలను మే 10వ తేదీన ఉదయం 7 గంటలకు తెరవనున్నట్లు ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో అక్కడ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.



ఇందులో భాగంగా ఆలయాన్ని 40 క్వింటాళ్ల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. పరమేశ్వరుడి పవిత్ర ఆలయాలైన 12 జ్యోతిర్లింగాల్లో కేదారనాథ్ ఆలయం ఒకటి. చార్‌ధామ్ యాత్రలో కేదార్ నాథ్ దేవాలయం సందర్శన భాగంగా ఉంటుంది. ఏటా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షల మంది భక్తులు కేదార్‌నాథ్‌కు చేరుకుని పరమేశ్వరుడ్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అయితే ఏటా శీతాకాలం ప్రారంభం కాగానే ఈ ఆలయాన్ని మూసివేస్తారు. ఏటా శీతాకాలంలో దాదాపు ఆరు నెలల పాటు ఈ ఆలయ తలుపులు మూసే ఉంటాయి. ఆ సమయంలో ఆలయం మొత్తం మంచుతో కప్పుకుపోయి ఉంటుంది. తిరిగి వేసవిలో ఈ ఆలయ తలుపులు తిరిగి తెరుస్తారు.

# యోగీ ప్రచారంలో బుల్‌డోజర్లు డ్యాన్స్

**మొదటిపేజీ తరువాయి**

ఆయన వేదిక వద్దకు రావడానికి ముందే డజన్ల కొద్దీ బుల్‌డోజర్లను అక్కడికి తీసుకువచ్చారు. ఆ తర్వాత మ్యూజిక్‌కు అనుగుణంగా.. ఆపరేటర్లు అటూ ఇటూ తిప్పుతూ బుల్‌డోజర్లతో విన్యాసాలు చేయించారు. కొందరు కార్యకర్తలు వాటిపైకి ఎక్కి నినాదాలు చేశారు. వీటిని 360 డిగ్రీల కోణంలో తిప్పారు. ఇంజిన్‌కు ఒక్కసారిగా యాక్సిలిరేషన్ ఇచ్చి.. బ్రేకులు వేయడం వంటివి చేశారు. ఒక దశలో వేదికపై ప్రసంగాల కంటే ప్రజలు ఈ బుల్‌డోజర్ల పైనే ఆసక్తి చూపడం మొదలుపెట్టారు. ఆ తర్వాత సీఎం యోగి వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "క్రిమినల్స్, దేశ వ్యతిరేక శక్తులతో డీల్ చేయడానికి ఈ యంత్రాలను విభిన్నమైన పద్ధతిలో వాడుతున్నాం. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ మన రక్షణకు తూట్లు పొడుస్తున్నాయి. ప్రతి ఒక్కరి జేబులను దోచుకోవడానికి వారు జట్టుకట్టారు. రామమందిరాన్ని వ్యతిరేకించే కూటమి అది" అని పేర్కొన్నారు.

# నేడు మోడీ రాక

**ముందడుగు, స్టేట్ బ్యూరో:**

ప్రధాని మోడీ శుక్రవారం తెలంగాణలో పర్యటించనున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మహబూబ్ నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ తరుపున ప్రచారం నిర్వహించనున్నారు. గుల్బర్గా విమానాశ్రయం నుంచి శుక్రవారం మధ్యాహ్నం 3:05 గంటలకు మోడీ నారాయణపేటకు చేరుకుంటారు. 3:15 నుంచి 4:05 వరకు నారాయణపేట బహిరంగ సభలో ప్రధాని పాల్గొని ప్రసంగిస్తారు. ఆ సభ అనంతరం 5:10 గంటలకు హెలికాప్టర్ లో హైదరాబాద్ కి మోడీ చేరుకుంటారు. 5:30 గంటల నుంచి 6:20 వరకు ఎల్బీ స్టేడియంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. 6:40 గంటలకు



బేగంపేట విమానాశ్రయం నుంచి భువనేశ్వర్ కి మోడీ వెళ్లనున్నారు. ఇదిలా ఉండగా పార్లమెంట్ ఎన్నికల ప్రచారం చివరి రోజైన 11వ తేదీన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణకు రానున్నారు. చివరి రోజు వనపర్తి, వికారాబాద్ లలో ప్రచారం నిర్వహించనున్నారు. మోడీ, అమిత్ షా వరుస పర్యటనలు పార్టీకి ప్లస్ అవుతాయని భావిస్తున్నారు.

# పదవ తరగతిలో 625/625

## నూటికి నూరుశాతం మార్కులు సాధించిన అంకిత

**ముందడుగు**

కర్ణాటక పదో తరగతి ఫలితాల్లో ఒక అమ్మాయి ఏకంగా 625/625 మార్కులు సాధించింది. బాగల్‌కోట్ జిల్లాకు చెందిన అంకిత కొనప్ప ఎస్ఎస్ఎల్సీ పరీక్షల ఫలితాల్లో అన్ని సబ్జెక్టుల్లోనూ నూటికి నూరుశాతం మార్కులతో అదరగొట్టారు. తండ్రి బసప్ప రైతు కాగా.. తల్లి గృహిణి. ముధోల్ తాలుకాలో ఉన్న మొరార్జీ దేశాయ్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న బాలిక.. ఇంజినీరింగ్ పూర్తి చేశాక ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని చెబుతున్నారు. ఆమె సాధించిన అపూర్వ విజయం గురించి టీచర్లు చెప్పగానే స్వగ్రామం వజ్రమట్టిలో ప్రజలంతా ఇంటికి చేరుకొని బాలికను అభినందించారు. గ్రామస్థులు సంబరాలు చేసుకొని మిఠాయిలు పంచుకున్నారు. ఈసందర్భంగా అంకిత మాట్లాడుతూ..




ఈ విజయం అంతా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదేనన్నారు. ఉపాధ్యాయులు తనను ఎంతగానో ప్రోత్సహించి సహకరించారన్నారు. ఐఏఎస్ అధికారిగా దేశానికి సేవ చేయాలని కోరుకొంటున్నట్లు అంకిత తెలిపారు. ఫలితాల్లో ఫస్ట్ ర్యాంక్ సాధించిన బాలికకు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, బాలాకోట్ డిప్యూటీ కమిషనర్ కేఎం జానకి, జిల్లా పంచాయత్ సీఈవో శశిధర్ అభినందనలు తెలిపారు. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆమె కుటుంబాన్ని త్వరలో కలిసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# వైన్ షాపు క్లోజ్ చేయించిన ఐదేళ్ల చిన్నారి

## పాఠశాలకు అనుకొని ఉందని కోర్టులో ఫిర్యాదు

**ముందడుగు గుజరాత్:**

తమ పాఠశాలకు అనుకొని వైన్ షాపును ఐదేళ్ల చిన్నారి మూసివేయించింది. వైన్ షాపు వల్ల చదువుకు చాలా ఇబ్బంది అవుతుందని ఓ చిన్నారి కోర్టుకెళ్లింది. అక్కడ ఆమెకు న్యాయం జరిగింది. కాన్పూర్‌లోని ఒక పాఠశాలకు అనుకుని ఒక వైన్ షాపు ఉంది. ఈ క్రమంలోనే స్కూల్ వెళ్లే పిల్లలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో ఎల్ కేజీ చదువుతున్న ఓ ఐదేళ్ల చిన్నారి అలాహాబాద్ హైకోర్టును ఆశ్రయించింది. వైన్ షాపు మూసివేయాలని కోరింది. కోర్టు కూడా చిన్నారి ఫిర్యాదును సీరియస్ గా తీసుకుని వైన్స్ లైసెన్స్ ను రద్దు చేయాలని తీర్పు ఇచ్చింది. స్కూల్ కు 30 మీటర్ల కంటే తక్కువ దూరంలో మద్యం షాపులు ఉండొద్దని వెల్లడించింది. ప్రస్తుత పిటిషన్ ఫిబ్రవరిలో దాఖలైంది. వైన్ షాప్ రూల్స్, 1968 లోని రూల్ 5(4)(a) నిబంధనలపై మద్యం దుకాణం మరియు ప్రజల ప్రార్థనా స్థలం, పాఠశాల, ఆసుపత్రి లేదా నివాస కాలనీల మధ్య 50 మీటర్ల దూరం ఉండాలని ఉంది. దీంతో చిన్నారి తండ్రి ఓ లాయర్ ను పెట్టుకుని కోర్టుకెళ్లాడు.



కోర్టు వైన్ షాపు లైసెన్స్ పునరుద్ధరించవద్దని తీర్పు ఇచ్చింది. ప్రస్తుతం ఓ ఐదేళ్ల చిన్నారి వైన్ షాపు లైసెన్స్ ను రద్దు చేయించిందన్న వార్త సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో, నెటిజన్స్ స్పందిస్తూ ప్రతి ఒక్కరు బాలికను ఆదర్శంగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

# జగన్ విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వొద్దు

**కోర్టును తిరిగిన సిబిఐ**

**ముందడుగు హైదరాబాద్:**

ఏపీ సీఎం జగన్ విదేశాలకు వెళ్లేందుకు కోరిన అనుమతి పిటిషన్‌పై సీబీఐ కోర్టులో విచారణ జరిగింది. ఆయన విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వొద్దని సీబీఐ కోరింది. అనంతరం తీర్పును న్యాయస్థానం ఈనెల 14కి వాయిదా వేసింది. ఈనెల 17 నుంచి జూన్ 1 వరకు యూరప్ పర్యటనకు సీఎం అనుమతి కోరారు. లండన్, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్‌లో పర్యటించేందుకు వీలుగా అనుమతి ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. కుటుంబ సభ్యులతో గడిపేందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని బుధవారం సీబీఐని కోర్టు ఆదేశించింది.

ముందడుగు

శుక్రవారం, 10-5-2024, హైదరాబాద్

# ఆరు నెలల్లో బిఆర్ఎస్ రాజకీయాలను శాసిస్తోంది

**బిజెపితో పోరాడే శక్తి కాంగ్రెస్‌కు లేదు ● బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్**

**ముందడుగు హైదరాబాద్:**

ఆరు నెలల్లో బిఆర్ఎస్ తెలంగాణ రాజకీయాలను శాసించే పరిస్థితి వస్తుంది. మోడీతో పోరాటం రాహుల్‌గాంధీ వల్ల కాదు'' అని కేటీఆర్ విమర్శించారు. బిజెపి ప్రభుత్వం హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేయాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అలా జరిగితే చిన్న పనుల కోసం కేంద్రంపై ఆధారపడాల్సిన పరిస్థితి వస్తుందని, అభివృద్ధి ఆగిపోతుందని అన్నారు. కేంద్రంలో ఉన్న సవతి తల్లిపై పోరాడాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి గులామ్‌గిరీ చేస్తున్నారని మండిపడ్డారు. ''రిజర్వేషన్లు రద్దు చేయాలని మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, అగ్రవర్ణాల్లో పేదల రిజర్వేషన్ల రద్దుకు కుట్ర జరుగుతోంది. రాజ్యాంగాన్ని తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. బిజెపితో పోరాడే పరిస్థితి కాంగ్రెస్‌కు లేదు. కొన్ని చోట్ల కాంగ్రెస్ ప్రభుత్వాలను కాషాయ పార్టీ పడగొట్టింది. కేసీఆర్ ప్రభుత్వాన్ని కూడా పడగొట్టాలని చూశారు. మా ఎమ్మెల్యేలను కొనేందుకు యత్నించారు. తెలంగాణలో వారి ఆటలు సాగలేదు. రాష్ట్రాల్లో ప్రాంతీయ శక్తులు బలంగా ఉండాలి.



# 18ఏళ్ల ట్రంప్ కుమారుడు రాజకీయ రంగప్రవేశం

**ఫ్లోరిడా ప్రతినిధిగా పంపనున్నట్లు సమాచారం**



**ముందడుగు జాతీయం:**

అగ్రరాజ్యం అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిన్న కుమారుడు బ్యారన్ ట్రంప్ రాజకీయ రంగ ప్రవేశం చేయనున్నారు. 'రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్'కు ఫ్లోరిడా నుంచి ప్రతినిధిగా పంపనున్నట్లు పార్టీ ఛైర్మన్ ఇవన్ పవర్ బుధవారం వెల్లడించారు. నవంబర్‌లో జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున డొనాల్డ్ ట్రంప్ పోటీ చేయనున్న విషయం తెలిసిందే. ఆయన ఎంపికను అధికారికంగా ధ్రువీకరించేందుకు జులైలో పార్టీ కన్వెన్షన్ జరగనుంది. దీనికి ఫ్లోరిడా నుంచి 41 మంది ప్రతినిధులు వెళ్లనున్నారు. వారిలో బ్యారన్ ట్రంప్ ఒకరని పవర్ వెల్లడించారు. బ్యారన్ ట్రంప్ ఇప్పటి వరకు బయటి ప్రపంచానికి దూరంగా ఉంటూ వచ్చారు. మార్చిలో ఆయనకు 18 ఏళ్లు వచ్చాయి. వచ్చే వారమే హైస్కూల్ నుంచి గ్రాడ్యుయేట్ కానున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు డొనాల్డ్ ట్రంప్‌నకు కోర్టు అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం 'హష్‌మనీ కేసు'లో ఆయన విచారణ ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. మరోవైపు ట్రంప్ ఇతర వారసులైన డొనాల్డ్ ట్రంప్ జూనియర్, ఎరిక్ ట్రంప్, చిన్న కుమార్తె టిఫనీ సైతం పార్టీ తరఫున ఫ్లోరిడా ప్రతినిధులుగా వ్యవహరించనున్నారు. పార్టీ కన్వెన్షన్ విస్కాన్సిన్‌లోని మిల్వాకీ నగరంలో జులై 1518 మధ్య జరగనుంది.

# దేశంలో గణనీయంగా తగ్గిన హిందూ జనాభా

**పెరిగిన బౌద్ధ, సిక్కు, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలు**

**ముందడుగు జాతీయం:**

భారతదేశంలో హిందూ జనాభా గణనీయంగా తగ్గినట్లు ప్రధానికి చెందిన ఎకనామిక్ అడ్వైజరీ కౌన్సిల్ తన రిపోర్టులో పేర్కొన్నది. 1950 నుంచి 2015 వరకు హిందువుల జనాభా 7.81 శాతం పడిపోయినట్లు ఆ స్టడీలో తేల్చారు. భారత్‌లో హిందువుల జనాభా తగ్గుతూ ఉండగా, మరోవైపు బౌద్ధ, సిక్కు, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల జనాభా పెరుగుతూ పోయింది. ఇక పార్సీలు, జైనులు జనాభా కూడా తగ్గింది. సమీప మిత్ర దేశాల్లో మెజారిటీ మతస్తుల సంఖ్య పెరుగుతుండగా, భారత్‌లో మాత్రం ఆ జనాభా తగ్గినట్లు రిపోర్టులో తెలిపారు.



1950 సంవత్సరంలో భారత్‌లో హిందువుల జనాభా 84.68 శాతం ఉండగా, 2015 నాటికి ఆ సంఖ్య 78.06 శాతానికి చేరుకున్నట్లు రిపోర్టులో వెల్లడించారు. మరో వైపు గడిచిన 65 ఏళ్ల కాలంలో ముస్లిం జనాభా మాత్రం 9.84 శాతం నుంచి 14.09 శాతానికి పెరిగిందని స్టడీలో పేర్కొన్నారు. మయన్మార్‌లో హిందువుల జనాభా పది శాతం పడిపోయింది. నేపాల్‌లో కూడా హిందువుల సంఖ్య 3.6 శాతం తగ్గినట్లు తెలిపారు.

భారత్‌లో మైనార్టీలకు రక్షణ పెరిగిందని, వాళ్లు ఇండియాలో సుఖంగా జీవిస్తున్నట్లు స్టడీలో వెల్లడించారు. ప్రభుత్వ విధానాలు, రాజకీయ నిర్ణయాలు, సామాజిక విధానాల వల్లే మెజారిటీ జనాభా తగ్గి, మైనార్టీ జనాభా పెరిగినట్లు అంచనా వేశారు. అయితే సమాజంలో భిన్నత్వాన్ని ప్రోత్సహించే రీతిలో ఇండియా ఉన్నట్లు స్టడీలో రచయితలు అభిప్రాయపడ్డారు.

# థాయిలాండ్‌కు వెళ్లే భారతీయులకు నో వీసా

**మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు ప్రకటన**

**ముందడుగు జాతీయం:**

థాయిలాండ్ పర్యటనకు వెళ్లే భారతీయులకు అక్కడి ప్రభుత్వం మరో వెసులుబాటు కల్పించింది. పర్యాటక వీసా మినహాయింపు కార్యక్రమాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ప్రత్యేకంగా వీసా అవసరం లేకుండానే థాయిలాండ్ అందాలను చుట్టి రావచ్చు. సాధారణ పాస్‌పోర్టు ఉన్నవారు అక్కడ గరిష్ఠంగా 30 రోజుల పాటు పర్యటించవచ్చు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు థాయిలాండ్ ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా భారత్, తైవాన్ దేశాల నుంచి వచ్చేవారు వీసా అవసరం లేకుండానే తమ దేశంలో పర్యటించేందుకు నవంబరు 10, 2023 నుంచి అనుమతిచ్చింది. ఈ గడువు



మే 10, 2024తో ముగుస్తోంది. ప్రభుత్వ చర్యలు సత్ఫలితాలు ఇస్తుండడంతో ఈ వెసులుబాటును మరో ఆరు నెలలపాటు పెంచుతున్నట్లు రాయల్ థాయ్ క్యాబినెట్ నిర్ణయించింది. నవంబర్ 11, 2024 వరకు ఇది వర్తిస్తుంది. అంతకుముందు ఈ పథకం ద్వారా కేవలం 15 రోజులు మాత్రమే అక్కడ ఉండడానికి వీలుండేది.

# పోలింగ్ కేంద్రంలో ఓటేసిన మైనర్ బాలుడు

**ముందడుగు మధ్యప్రదేశ్:**

మధ్యప్రదేశ్ బెరాసియా ప్రాంతానికి చెందిన బిజెపి స్థానిక నేత వినయ్ మెహర్ తన మైనర్ కుమారుడితో కలిసి ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చాడు. తన తండ్రి స్థానంలో ఆ పిల్లాడు ఈవీఎం బటన్ నొక్కి భాజపాకు ఓటు వేశాడు. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక ఖాతాల్లో చక్కర్లు కొట్టాయి. దాంతో ఇవి కాస్తా కాంగ్రెస్ సీనియర్ నేత కమల్‌నాథ్ దృష్టికి చేరాయి. ''బిజెపి.. ఎన్నికల సంఘాన్ని పిల్లల ఆట వస్తువుగా మార్చింది. బిజెపి నేత వినయ్ మెహర్ తన ఓటును కుమారుడితో వేయించారు. ఆ తతంగాన్ని వీడియో తీసి, ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. పిల్లల్ని, మొబైల్ ఫోన్లను లోపలికి ఎలా అనుమతించారు..? దీనిపై ఏమైనా చర్యలు ఉంటాయా..?'' అని కమల్‌నాథ్ ప్రశ్నించారు. దీనిపై ఎన్నికల సంఘం నుంచి స్పందన రావాల్సి ఉంది. గుజరాత్‌లోని దాహోద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఓ పోలింగ్ కేంద్రంలో కూడా ఇదే తరహా ఘటన ఒకటి జరిగింది.

**కుమారుడితో వేయించిన బిజెపి నేత**



కేంద్రం లోపల నుంచి వీడియోను ప్రత్యక్ష ప్రసారం చేసిన విజయ్ భాభోర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడు స్థానిక భాజపా నేత కుమారుడు. ఇలాంటి చర్యతో ప్రజాస్వామ్యాన్ని అవమానించారంటూ కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది.

ముందడుగు
శుక్రవారం, 10-5-2024, హైదరాబాద్

# రోజు మెట్లు ఎక్కి దిగుతే చాలు..!

**అకాల మరణ ముప్పను తగ్గిస్తుంది ▪ మెదడు, గుండె, ఊపిరితిత్తుల పనితీరు మెరుగు**

**ముందడుగు ఆరోగ్యం:**

ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించాలంటే శరీరంలోని కీలక అవయవాలు గుండె, కిడ్నీలు, కాలేయం వంటివి సక్రమంగా పనిచేయాలి. మంచి ఆహారం తినడంతో పాటు ప్రతిరోజు శారీరక శ్రమ చేస్తే శరీరంలో అవయవాలు ఆరోగ్యంగా ఉంటాయి. వాటి ఫలితంగా మనిషి జీవితకాలం పెరుగుతుంది. రోజూ మెట్లు ఎక్కి దిగినా మనిషి ఆరోగ్యానికి చాలా మంచిదని తాజా పరిశోధనలో వెల్లడైంది.



### ఆకస్మిక మరణం ముప్ప ఉండదు

రెగ్యులర్‌గా మెట్లు ఎక్కడం వల్ల శరీరంలోని కండరాలు సంకోచం, వ్యాకోచం చెంది రిలాక్స్ అవుతాయి. ఇది అకాల మరణ ముప్పును తగ్గిస్తుందని అధ్యయనం పేర్కొంది. క్రమం తప్పకుండా మెట్లు ఎక్కడం వల్ల సాధారణ జీవితకాలం కంటే అదనంగా 14 సంవత్సరాలు జీవించవచ్చని అధ్యయనంలో తేలింది.

### జీవితకాలం అదనంగా 14 ఏళ్లు పెరుగుదల

రెగ్యులర్ వర్కవుట్స్ చేసేవారు లేదా క్రమం తప్పకుండా మెట్లు ఎక్కే వ్యక్తులు ఎంత ఎక్కువ కాలం జీవిస్తారో తెలుసుకోవడానికి పరిశోధకులు దాదాపు 5 లక్షల మంది వ్యక్తుల హెల్త్ డేటాను అధ్యయనం చేశారు. డైలీ మెయిల్ రిపోర్ట్ ప్రకారం..క్రమం తప్పకుండా మెట్లు ఎక్కే వ్యక్తుల్లో హృదయ సంబంధ వ్యాధుల కారణంగా మరణించే రిస్క్ 39 శాతం తక్కువగా ఉంటుంది. ఇది గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. వ్యక్తి జీవితకాలం అదనంగా 14 సంవత్సరాలు పెరగడానికి ఇదే కారణమని నిపుణులు గుర్తించారు. ప్రతిరోజూ మెట్లు ఎక్కడం వల్ల మనిషికి ప్రాణాంతకం కలిగించే అనేక ఇతర వ్యాధుల ప్రమాదాన్ని సైతం తగ్గిస్తుందని అధ్యయనంలో తేలింది.

### అనారోగ్యాలకు మూలం శ్రమ లేకపోవడం

ప్రస్తుత ఆధునిక యుగంలో సౌకర్యాలు మెరుగుపడ్డాయి. ఫలితంగా శారీరక శ్రమ తగ్గింది. ఒకప్పుడు రోజులో కనీసం మూడు నాలుగు సార్లు మెట్లు ఎక్కే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఎక్కడచూసినా ఎలివేటర్లు, ఎస్కలేటర్లు అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా మెట్లను ఎవరూ ఉపయోగించుకోవడం లేదు. ఉద్యోగాల్లో ఎక్కువగా డెస్క్ జాబ్స్ ఉంటున్నాయి. వీటన్నింటి కారణంగా శరీరక శ్రమ బాగా తగ్గిపోతుంది. ఇది చివరికి అనేక అనారోగ్య సమస్యలకు దారితీస్తోంది.

### ఆరోగ్యం కోసం మెట్ల వినియోగం పెరగాలి

ఈస్ట్ ఆంగ్లియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సోఫీ పాడాక్ మాట్లాడుతూ... ''ఎస్కలేటర్ అందుబాటులో ఉన్నప్పటికీ మెట్లను వినియోగించుకోవాలి. మెట్లు ఎక్కడం వల్ల మనిషి ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఎవరైనా చాలా ఎత్తైన అంతస్తుకు వెళ్లాల్సి వస్తే శరీరం ఫిట్‌గా ఉండేందుకు కనీసం నాలుగైదు అంతస్తులు ఎక్కాలి.'' అని ప్రొఫెసర్ సోఫీ సూచించింది.

### మెట్లు ఎక్కితే వచ్చే ప్రయోజనాలు

మెట్లు ఎక్కడం అనేది వివిధ వ్యాయామాల కంటే చాలా ప్రభావవంతంగా పనిచేస్తుందని అధ్యయనంలో తేలింది. బరువు తగ్గాలనుకునేవారు శరీరంలో కేలరీలను కరిగించుకోవడానికి మెట్లు ఎక్కితే సరిపోతుంది. జాగింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్ వంటి వ్యాయామాల కంటే మెట్లు ఎక్కడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. మెదడు, గుండె, ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. శరీరంలో ఆక్సిజన్ లెవల్స్ పెరుగుతాయి. రక్తప్రసరణ మెరుగవుతుంది. ఆయుర్దాయం పెరుగుతుంది. మెట్లు ఎక్కడం వల్ల శరీరం ఫిట్‌గా మారుతుంది. నిద్ర నాణ్యత పెరుగుతుంది.





# ఉత్తర విశాఖలో ప్రజలు గెలవాలి

**ప్రజల కోసం పెట్టిన పార్టీ జై భారత్ ▪ ఇంటింటికి తిరుగుతున్న జెడీ**

**ముందడుగు విశాఖపట్నం:**

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో నాయకులు కాదు ప్రజలే గెలవాలని సిబిఐ మాజీ జెడీ లక్ష్మినారాయణ అన్నారు. గురువారం కంచెరపాలెంలోని పలు వీధుల్లో ప్రచారం నిర్వహించారు. ప్రజలను ఇంటింటికి వెళ్లి కలుస్తూ ఈ సారి జరుగుతున్న ఎన్నికల్లో మీరు గెలవాలని కోరారు. కస్తూరి నగర్ కార్నర్ సమావేశంలో జెడీ లక్ష్మి నారాయణ మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని అన్నారు. చదువుకున్న యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని విశాఖ కేంద్రంగా గంజాయి విపరీతంగా పెరిగిపోయిందని ఆయన అన్నారు యువత ఉద్యోగ అవకాశాలు ఉన్నప్పుడే మాదకద్రవ్యాలకి దూరంగా ఉంటారని తద్వారా ఉన్నత భవిష్యత్తును ఏర్పరచుకోవచ్చని అన్నారు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత యువతికి పెద్దపీటం



వేయడం జరుగుతుందని అలాగే నియోజకవర్గ అభివృద్ధికి పక్కా ప్రణాళికతో నియోజకవర్గ మేనిఫెస్టో తయారు చేశామని ఆ మేనిఫెస్టో అమలుపరిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజవర్గంగా ఉత్తమ నియోజకవర్గంగా పేరు పొందుతుందని తెలిపారు.

### జెడీకి అన్ని వర్గాల మద్దతు

నియోజకవర్గంలో ఇంటింటా తిరుగుతూ ప్రతి ఒక్కరిని కలుస్తూ వాళ్ల యొక్క సమస్యలు తెలుసుకుంటూ వారి యొక్క అభిమానాన్ని చూరగొంటున్నానని ఎక్కడికి వెళ్ళినా ప్రజల స్పందన బాగుందని అందరూ మార్పు కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. మార్పుకు ప్రతీకగా ప్రతి ఒక్కరూ టార్చ్ లైట్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో జై భారత్ నేషనల్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రపతి చేతుల మీదుగా చిరుకు పద్మవిభూషణ్

రిపబ్లిక్ ఆఫ్ ఇండియా రెండవ అత్యున్నత పౌర పురస్కారం 'పద్మవిభూషణ్' అవార్డుల ప్రదాన వేడుక నేడు (మే 9, 2024) దిల్లీలో జరిగింది. ఈ వేడుకలో పద్మవిభూషణ్ గ్రహీత, టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి.. ఆయన కుమారుడు రామ్ చరణ్, ఉపాసన పాల్గొన్నారు. మెగాస్టార్ చిరంజీవి ప్రతిష్టాత్మక అవార్డు అందుకునే సమయంలో చరణ్ ఉపాసన దంపతులు ఈ సందర్భాన్ని ఎంతో ఆనందంగా సెలబ్రేట్ చేసుకోవడం తాజాగా రిలీజైన వీడియోలో కనిపిస్తోంది. చిరంజీవితో పాటు విలక్షణ నటి వైజయంతిమాల కూడా ఈ అవార్డును అందుకోవడం విశేషం. ఈ ఏడాది జనవరిలో అవార్డు గ్రహీతల పేర్లను ప్రకటించారు. నేడు పురస్కారాలను అందుకున్నారు. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవి ఈ వేడుక కోసం ఎంతో హుందాగా ముస్తాబై వచ్చారు. సూట్‌లో ఆయన జెంటిల్మన్ ని తలపించారు. భారతదేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీజీ, అమిత్ షా సహా ఎందరో దిగ్గజాలు కొలువు దీరి ఉండగా వారందరికీ గౌరవపూర్వకంగా నమస్కరించిన మెగాస్టార్ వేదిక వద్దకు ఎంతో హుందాగా నడుచుకుంటూ వెళ్లారు. అక్కడ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం తాను అశీనుడైన సీట్ వద్దకు వెళుతున్న దృశ్యాలు ఇప్పుడు అంతర్జాలంలో వైరల్ అవుతున్నాయి. ఈ వేడుక కోసం మెగా కుటుంబం ఇంతకుముందే రాజధాని నగరానికి విచ్చేసింది. చిరంజీవి, రామ్ చరణ్ ఇంతకుముందే ఢిల్లీ విమానాశ్రయం నుండి నిష్క్రమించిన వీడియో, ఫోటోలను X (గతంలో ట్విట్టర్ అని పిలుస్తారు) లోని అనేక అభిమానుల పేజీలు షేర్ చేయగా వైరల్ అయ్యాయి. అలాగే చిరంజీవి ఢిల్లీకి వచ్చేందుకు మెగాస్టార్, ఆయన కుటుంబీకులు తన ప్రైవేట్ జెట్ ఎక్కిన వీడియోలు ఇంటర్నెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. ఆ వీడియోలో చిరంజీవి బ్లాక్ టీ షర్ట్, బ్లూ డెనిమ్ ధరించగా, రామ్ చరణ్ బ్లూ డెనిమ్ షర్ట్, బ్లాక్ ప్యాంట్ ధరించాడు. చిరంజీవిసురేఖ దంపతులు, రామ్ చరణ్ ఉపాసన దంపతులు ఈ ప్రతిష్టాత్మక అవార్డు వేడుకకు హాజరయ్యారు.

